ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం 5
జనవరి 2026



# యాదగిరిగుట్టలో అధ్యయనోత్సవాలు పరిసమాప్తి

**డిసెంబర్ 30 నుండి జనవరి 4 వరకు జరిగిన అధ్యయనోత్సవాలు**

**ఆదివారం లక్ష్మనరసింహస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారు**

**సోమవారం నుండి తిరిగి ప్రారంభం కానున్న ఆర్జిత సేవలు**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మనరసింహస్వామి క్షత్రంలో గత ఆరు రోజులుగా జరుగుతున్న అధ్యయనోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నిర్వహించిన లక్ష్మనరసింహస్వామి అలంకార సేవతో అధ్యయనోత్స వాలకు ఆలయ అర్చకులు పరిసమాప్తి పలికారు. డిసెంబర్ 30న మొదలైన అధ్యయనోత్సవాలు.. జనవరి 4 వరకు ఆరు రోజుల పాటు వైభవంగా జరిగాయి.



ఇందులో భాగంగా అర్చకులు డిసెంబర్ 30 నుండి రోజుకు రెండు అవతారాల్లో స్వామివారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఇక చివరిరోజైన ఆదివారం చేపట్టిన శ్రీలక్ష్మనరసింహస్వామి అలంకార సేవతో అధ్యయనోత్సవాలకు ముగింపు పలికారు. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన ఆదివారం ఉదయం స్వామివారిని లక్ష్మనరసింహస్వామి అలంకారంలో ముస్తాబు చేసి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి నిత్యారాధనలు ముగిసిన అనంతరం.. స్వామివారిని రకరకాల పూలు, వజ్ర వైఢూర్యాలు, బంగారు ఆభరణాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అనంతరం స్వామివారి అలంకార సేవను ప్రధానాలయ తిరువీధుల్లో విహరింపజేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం అద్దాల మండపంలో ప్రత్యేక వేదికపై స్వామివారి సేవను అధిష్టింపజేసిన అర్చకులు.. శ్రీలక్ష్మనరసింహస్వామి అవతార విశిష్టతను భక్తులకు ప్రవచించారు. యాదరుషి కఠోర తపస్సుకు ప్రసన్నుడైన నారసింహుడు.. యాదగిరిగుట్ట క్షత్రంలో పంచరూపాలలో వెలిశారని భక్తులకు ప్రవచించారు. ఇక ఆదివారంతో అధ్యయనోత్సవాలు ముగియడంతో.. డిసెంబర్ 30 నుండి రద్దు చేయబడిన ఆర్జిత సేవలు, నిత్య, శాశ్వత, మొక్కు కల్యాణాలు, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం వంటి నిత్య కైంకర్యాలు సోమవారం నుండి తిరిగి ప్రారంభం కానున్నాయి.

# యాదగిరిగుట్టలో భక్తుల సందడి

**ఉచిత దర్శనానికి రెండు, స్పెషల్ దర్శనానికి అరగంట సమయం**

**ఆదివారం ఆలయానికి రూ.40.81 లక్షల ఆదాయం**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మనరసింహస్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. హైదరాబాద్ సహా రాష్ట్ర నలుమూలల నుండి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాల్లో కోలాహలం నెలకొంది. రద్దీ కారణంగా కొండపైన బస్ బే, దర్శన, ప్రసాద క్యూలైన్లు, లక్ష్మపుష్కరిణి, కల్యాణకట్ట, వ్రత మండపాలు కిటకిటలాడాయి. భక్తుల రద్దీ కారణంగా స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటలు, స్పెషల్ దర్శనానికి అరగంట సమయం పట్టింది. మరోవైపు ఆలయంలో నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం సుప్రభాతంతో మొదలై రాత్రి పవళింపుసేవతో ముగిశాయి. ఇక భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ.40,81,041 ఆదాయం వచ్చింది. అత్యధికంగా ప్రసాద విక్రయం ద్వారా రూ.15,65,570 లక్షలు, వీఐపీ దర్శన టికెట్ల ద్వారా రూ.6.60 లక్షలు, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.6.83 లక్షలు, బ్రేక్ దర్శనాలతో రూ.4,50,900 అదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.



# యాదగిరీశుడి సేవలో పలువురు ప్రముఖులు



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మనరసింహస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లు బోరెడ్డి అయోధ్య రెడ్డి, పీవీ శ్రీనివాసరావు ఇద్దరూ కలిసి వారి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకోగా.. రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి సపరేట్ గా దర్శించుకున్నారు. గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రధానాలయ ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం కొండపైకి వచ్చిన వారికి ఆర్డీవో కృష్ణారెడ్డి పూలమొక్కను బహూకరించి స్వాగతం పలికారు. అనంతరం త్రితల గోపురం గుండా ఆలయంలోకి ప్రవేశించిన వారికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు వారికి వేదాశీర్వచనం చేయగా.. ఆలయ డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్ శర్మ, సూపరింటెండెంట్ రాజన్ బాబు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేసి నారసింహుడి ఫొటోను బహూకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గణేష్ నాయక్, సీఐ భాస్కర్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా బీర్ల మనోజ్ బర్త్ డే వేడుకలు

**బీర్ల టీం ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో దుప్పట్లు పంపిణీ**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, సైదాపురం మాజీ సర్పంచ్ బీర్ల శంకర్ కుమారుడు బీర్ల మనోజ్ కుమార్ బర్త్ డే సందర్భంగా.. ఆదివారం బీర్ల టీం ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట మండలంలోని పలు గ్రామాల్లో వృద్ధులు, అనాథలు, పేదవారికి దుప్పట్ల పంపిణీ చేశారు. చిన్నకందుకూరు, చొల్లేరు, మహబూబ్ పేట గ్రామాలలో దాదాపుగా 200 మంది పేదప్రజలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీర్ల మనోజ్ కుమార్ మాట్లాడుతూ.. నా సొంత ప్యాకెట్ మనీతో ఇలాంటి సేవ కార్యక్రమాలు చేయాలని ఆలోచనతో ముందుకు వచ్చానని, బర్త్ డే అనగానే హంగు ఆర్భాటాలు చేయకుండా ప్రజాసేవ చేయాలని ఆలోచనతో దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టానని తెలిపారు. ఈ కార్యక్రమానికి తన నాన్న బీర్ల శంకర్ సహకారంతో భవిష్యత్తులో అనేక కార్యక్రమాలు చేపడుతూ ముందుకు వెళ్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, సైదాపురం మాజీ సర్పంచ్ బీర్ల శంకర్ మాట్లాడుతూ.. బీర్ల టీం తరపున మండలంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా సహాయ సహకారాలు అందిస్తామని, భవిష్యత్తులో మరెన్నో కార్యక్రమాలు తీసుకొని ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మాజీ ఎంపీటీసీ మధుకర్, ఆర్టీఏ మెంబర్ ఆకుల నరసింహ, యాదగిరిగుట్ట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బిక్షపతి గౌడ్, నాయకులు ప్రవీణ్ కుమార్, పలు గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేయాలి

**యాదగిరిగుట్ట బీజేపీ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్**




యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: అధికార పార్టీ అండదండలతో ఎలాంటి లింక్ డాక్యుమెంట్లు లేకున్నా అధికార పార్టీ బినామీ వ్యక్తుల పేర్లపై ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తున్న యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ పై చర్యలు తీసుకోవాలని యాదగిరిగుట్ట బీజేపీ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ డిమాండ్ చేశారు. యాదగిరిగుట్టలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు యాదగిరిగుట్టలో గత కొన్నేండ్ల నుండి పడావు పడి ఉన్న ప్లాట్లను గుర్తించి సబ్ రిజిస్ట్రార్ తో కుమ్మక్కై ఎలాంటి లింకు డాక్యుమెంట్లు లేకున్నా తమ బినామీల పేర్లపై ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని ఆరోపించారు. యాదగిరిగుట్టలోని మయూరి హోటల్ పక్కన సర్వే నంబర్ 24/1లో 250 గజాల ప్లాట్ ను 1984లో కొనుగోలు చేసిన కొప్పు స్వామినాథన్ అనే వ్యక్తి చాలా సంవత్సరాల క్రితమే చనిపోయాడని తెలిపారు. దీంతో గత కొన్నేండ్లుగా ఆ ప్లాట్లును ఎవరూ పట్టించుకోకపోవడంతో.. ఇదే అదునుగా భావించిన పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ భర్త.. వల్లందాస్ స్వామి అనే వ్యక్తిని తెరపైకి తీసుకొచ్చి వల్లందాస్(కొప్పు) స్వామి అలియాస్ స్వామినాథన్ పేరుతో కొత్త డాక్యుమెంట్ సృష్టించి వారి బినామీపై రిజిస్ట్రేషన్ చేపించాడని ఆరోపించారు. అంతేకాకుండా సదరు ప్లాట్ లో మూడంతస్తుల బిల్డింగ్ ను కూడా నిర్మించారని తెలిపారు. అబశ్రీశ్రీఎలాంటి సీసీ కాపీ, లింకు డాక్యుమెంట్ లేకున్నా నిబంధనలు ఉల్లంఘించి రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారం అండగా చూసుకుని పాత లింకు డాక్యుమెంట్లను ధ్వంసం చేసి సబ్ రిజిస్ట్రార్ తో కుమ్మక్కై కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి నరేష్, కార్యదర్శులు కర్ణ, సురేష్, సీనియర్ నాయకులు రాజిరెడ్డి, నాయకులు విజయ్, శ్రీకాంత్, నరేష్, అజయ్, ప్రశాంత్, నిఖిలద తదితరులు ఉన్నారు.

